WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091



Facebook.varadhinews

# విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:100
శనివారం,
01.03.2025




# రేషన్ కార్డుల పంపిణీ వాయిదా

- కోడ్‌లేని జిల్లాల్లోనూ నిలిపివేత
- మార్చి 1న లక్ష కార్డులివ్వాలని గతంలో నిర్ణయం
- కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వకుంటే సమస్యలు
- ఎన్నికల కోడ్ ముగిశాక పంపిణీ ప్రక్రియ

వారధి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో రేషన్‌కార్డుల పంపిణీ వాయిదా వేసింది. మొదట మార్చి 1న లక్ష తెల్ల రేషన్‌కార్డుల పంపిణీ చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినా... ఆ తరువాత ఇంకా పలు జిల్లాల్లో కార్డు దరఖాస్తుల విచారణ పూర్తి కాకపోవడంతో పంపిణీ వాయిదా వేయాలని నిర్ణయించారు. కొందరికి కార్డులు ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వకుంటే సమస్యలు వచ్చే అవకాశం ఉందనే అంచనాతో కార్యక్రమాన్ని నిలిపివేసినట్లుగా సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది

..మిగతా 2 లో

# తెలంగాణ పాలిట సైంధవుడు..

## అన్ని పనులనూ అడ్డుకుంటున్నారు

- కేంద్రం తెలంగాణకు చేసిందేమీ లేదు
- ప్రధాని దగ్గరకు ఎన్నిసార్లు వెళ్లినా ఒక్క ప్రాజెక్టూ ఇవ్వట్లేదు
- కిషన్ రెడ్డి కావాలనే ముందుకు పోనివ్వట్లేదు
- నాకు పేరొస్తుందనే ఉద్దేశంతోనే సహకరించట్లేదు
- ఆయన బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరు
- కేంద్ర మంత్రిపై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ
- పార్టీ కోసం కష్టపడ్డ వారికే అవకాశం




కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వల్లే తెలంగాణకు ప్రాజెక్టులు రావడం లేదని.. తెలంగాణ పాలిట ఆయన సైంధవుడిలా మారారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కిషన్ రెడ్డి వల్లే రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు అనుమతి లభించడంలేదన్నారు. "మీరు ప్రత్యేకంగా తెలంగాణకు తీసుకొచ్చిన ప్రాజెక్టు ఏంటో చెప్పండి కిషన్ రెడ్డి గారూ.. నోరు వేసుకొని బెదిరిస్తే భయపడేవారు ఇక్కడెవరూ లేరు.

వారధి, స్టేట్ బ్యూరో:

మెట్రో, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టులను కిషన్ రెడ్డి అడ్డుకొంటున్నారు. సబర్మతి సుందరీకరణను ప్రశంసించిన కిషన్ రెడ్డి మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును మాత్రం వ్యతిరేకిస్తున్నారు. మేం ప్రధాని మోదీ వ్యక్తిగత ఆస్తుల్ని అడగడం లేదు. రాష్ట్రం నుంచి కేంద్రానికి భారీగా పన్నులు వెళ్తున్నాయి. తెలంగాణ చెల్లించిన పన్నుల్లో పావలా కూడా రాష్ట్రానికి రావట్లేదు. కేంద్ర ప్రభుత్వం నిధులన్నీ యూపీ, బిహార్‌లకే ఇస్తోంది'' అని విమర్శించారు.

**రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారు..?**

తెలంగాణలో ప్రాజెక్టుల గురించి కేంద్ర మంత్రి వర్గంలో ఎప్పుడైనా ప్రస్తావించారా? అని కిషన్ రెడ్డిని సీఎం నిలదీశారు. ఇప్పటివరకు ఎన్ని ప్రాజెక్టులను మీరు రాష్ట్రానికి సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. "తెలంగాణ కోసం కేంద్రాన్ని ఏం అడిగారో చెప్పండి. మీరు ప్రస్తావించినవేంటో చెప్పండి. మీకు చిత్తశుద్ధి లేదు. సైంధవ పాత్ర పోషిస్తున్నారు. మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే ఈ ప్రాజెక్టులన్నింటికీ అనుమతులు తీసుకొని హైదరాబాద్‌కు రావాలి. గతంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్ని కోట్ల మందికి ఇచ్చారో చెప్పండి. తెలంగాణలో కేంద్రం ఎన్ని ఇళ్లు ఇచ్చిందో చెప్పండి. రైతులకు నల్ల చట్టాలు తీసుకొచ్చి కేంద్రం వందల మందిని బలితీసుకుంది. మెట్రో నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు ఉన్నాయా అని కిషన్ రెడ్డి అవహేళన చేస్తున్నారు. మేం ఢిల్లీకి వెళ్లి లిక్కర్ దందాలు చేయడం లేదు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం వెళ్తున్నాం. ప్రధానిని

..మిగతా 2 లో



# ముగిసిన కులగణన రీసర్వే

- 12 రోజుల్లో పాల్గొన్న 15 వేల కుటుంబాలు
- ఇప్పటికే చేపట్టిన సర్వేలో 3 కోట్ల 4 లక్షల మంది వివరాలు
- రీసర్వేలో పాల్గొనని కేసీఆర్ ఫ్యామిలీ

..మిగతా 2 లో

# అందరి లెక్కలూ తేలుస్తాం

## పింక్ బుక్ మెయింటెయిన్ చేస్తున్నాం

- బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం
- మాకు టైమొచ్చినప్పుడు చూపిస్తాం
- కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వార్నింగ్

వారధి, స్టేట్ బ్యూరో:

బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేసిన వారి చిట్టా పింకు బుక్‌లో రాస్తామని... టైం వచ్చినప్పుడు అందరి సంగతి తేలుస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. శుక్రవారం నాడు కొల్లాపూర్ మండలం సింగోటంలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డితో కలిసి ఆమె పర్యటించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై, మంత్రి జూపల్లిపై విమర్శలు గుప్పించడం హాట్ టాపిక్ గా

..మిగతా 2 లో





# మార్చి 6న రాష్ట్ర కేబినెట్ భేటీ

- బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశం
- స్థానిక ఎన్నికలపై కీలక ప్రకటన వెలువడే ఛాన్స్
- కొత్త రేషన్ కార్డుల పంపిణీపైనా క్లారిటీ
- పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

వారధి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ మంత్రి వర్గ సమావేశం మార్చి 6వ తేదీన జరగనుంది. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అదే సమయంలో తెలంగాణా అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు సంబంధించి అమలుపై కూడా కేబినెట్ సమావేశం చర్చించనుంది. మార్చి 3తో

..మిగతా 2 లో



# హరీశ్‌రావుపై మరో కేసు

- ప్రాణహాని ఉందంటూ చక్రధర్ గౌడ్ ఫిర్యాదు
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు
- రెండో నిందితుడిగా మాజీ మంత్రి పేరు
- గతంలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కేసు నమోదు

2 లో


# 8 మంది కార్మికులు మృతి..?

## ప్రమాద స్థలంలో పేరుకుపోయిన బురద, రాళ్లు

- పేర్లు పెట్టి పిలిచినా పలకని కార్మికులు
- జీపీఆర్‌మిషన్‌తో ఎన్డీఆర్ఎఫ్ బృందాల స్కానింగ్
- కార్మికులు మట్టిలో కూరుకుపోయినట్లు అనుమానాలు
- ప్రభుత్వం నుంచి వెలువడని అధికారిక ప్రకటన
- ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- నేటి సాయంత్రానికి కీలక ప్రకటన వచ్చే అవకాశం
- రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తవుతందన్న మంత్రి ఉత్తమ్
- కార్మికులు బతికే అవకాశం లేదన్న మంత్రి జూపల్లి

వారధి, స్టేట్ బ్యూరో:

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ ప్రమాదం విషాదాంతమే అయ్యింది. ఫిబ్రవరి 22వ తేదీన ఉదయం 8:30 గంటల సమయంలో పైకప్పు కూలిన ఘటనలో 8 మంది లోపలే చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అయితే.. ఆ 8 మందిని ఎలాగైనా ప్రాణాలతో బయటికి తీసుకురావాలని ప్రతి ఒక్కరు శాయాశక్తులా ప్రయత్నించిన ప్రయత్నాలన్ని విఫలమే అయ్యాయి. వారం రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యల్లో భాగంగా.. ఈరోజు (ఫిబ్రవరి 28న) టీబీఎం



..మిగతా 2 లో



# మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

## రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షా కేంద్రాలు

- 9, 96,971 మంది విద్యార్థులు హాజరు
- పరీక్షలు సజావుగా నిర్వహించాలి
- సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- సమీపంలోని జిరాక్స్ సెంటర్లు బంద్

వారధి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం వేదికగా

..మిగతా 2 లో

# తెలంగాణ పాలిట సైంధవుడు..

మొదటిపేజీ తరువాయి



ఎన్నిసార్లు కలిసినా ఒక్క ప్రాజెక్టునూ మంజూరు చేయట్లేదు" అని సీఎం రేవంత్ అన్నారు.

**కష్టపడ్డ వారికే నామినేటెడ్‌పదవులు**

కాంగ్రెస్ కేడర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. మంచి మైకులో చెప్పాలి.. చెడు చెవిలో చెప్పాలని అన్నారు. కానీ మంచి చెవిలో చెప్పి.. చెడును మైకుల్లో వాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను మీనాక్షి సమన్వయం చేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాల్లో పీసీసీ కార్యవర్గ సభ్యులు క్రియాశీలకంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా పార్టీలో గుర్తింపు ఉండటంతో పాటు పదవులు కూడా వరిస్తాయని కీలక వ్యాఖ్యలు చేశారు. నామినేటెడ్ పోస్టులు కూడా అలాంటి వారికే ఇస్తామని అన్నారు. సమర్థులైన కార్యకర్తలకు సముచిత స్థానం తప్పకుండా ఉంటుందని భరోసా ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారిలో కొందరికి పదవులు రాలేదు. మరో విడతలో తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పదవులు రాలేదని కాంగ్రెస్ నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మార్చి 10లోపు జిల్లాల వారీగా ఇన్‌ఛార్జి మంత్రులు నామినేటెడ్ పదవులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.

# రేషన్ కార్డుల పంపిణీ వాయిదా

మొదటిపేజీ తరువాయి

మంది రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈనెల 8 కల్లా ఎన్నికల కోడ్ ముగియనుంది. అనంతరం దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగనుందని సమాచారం.

# అందరి లెక్కలూ తేలుస్తాం

మొదటిపేజీ తరవాయి భాగం

మారింది.స్థానికంగా ఉన్న లింగాకార లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం కోసం గతంలో కేసీఆర్ రూ.17 కోట్లు మంజూరు చేస్తే.. ఆ నిధులను జూపల్లి కృష్ణారావు రద్దు చేయడం దారుణమని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు స్వామి వారి దగ్గరికి దర్శనం చేసుకోవడానికి వస్తూ ఉంటారని ఆమె తెలిపారు. ఒక ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు ఇంకొక ప్రభుత్వంలో కొనసాగాలని.. వాటితో ప్రజలకు లాభం జరగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. తక్షణమే క్యాన్సిల్ చేసినటువంటి డబ్బుల్ని తీసుకొని వచ్చి ఆలయ అభివృద్ధి కోసం జూపల్లి కృష్ణారావు కృషి చేయవలసిందిగా డిమాండ్ చేశారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆమె అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్ రెడ్డిని హత్య చేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నాయన్నారు. నిన్న రాత్రి సాతపూర్ గ్రామంలో ఇవాళ మీటింగ్ కోసం ఫ్లెక్సీ కడుతుంటే బీఆర్ఎస్ కార్యకర్త పరమేష్‌పై దారుణంగా 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి దాడి చేశారన్నారు. సీఎం సొంత జిల్లా అయినప్పటికీ కేసుల విషయంలో పురోగతి లేకపోవడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడకుండా హంతకులకు కొమ్ముగాస్తుందని విమర్శించారు.

ఇక జూపల్లి కృష్ణారావు టూరిజం మంత్రిగా కాకుండా కొల్లాపూర్ నియోజక వర్గానికి అప్పుడప్పుడు వస్తూ టూరిస్ట్ మంత్రిగా వ్యవహారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు నియోజకవర్గంలో పండే మామిడికాయలను దేశంలోని నలుమూలాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి జరుగుతాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొల్లాపూర్ ప్రాంతంలో మామిడి మార్కెట్ మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు.



# మార్చి 6న రాష్ట్ర కేబినెట్ భేటీ

మొదటిపేజీ తరవాయి భాగం

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనున్నది. దీంతో కొత్త రేషన్ కార్డుల పంపిణీపై కూడా కేబినెట్ లో చర్చించే ఆస్కారం ఉంది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు అంశాలపై కేబినెట్ డెసిషన్స్ తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

వివిధ అంశాలపై...

దీంతో పాటు ఎస్.ఎల్.బి.సి ప్రమాదంపై చర్చించనుంది. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై కూడా తెలంగాణ కేబినెట్ సమావేశం చర్చించనున్నట్లు తెలిసింది. ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, కులగణన సర్వేలపై కేబినెట్ చర్చించి కీలక నిర్ణయం తీసుకోనుందని అధికార వర్గాలు వెల్లడించాయి. తెలంగాణలో మెట్రో రైలు విస్తరణ పనులపై కూడా కేబినెట్ చర్చించే ఛాన్స్ ఉంది.

# రాష్ట్రంలో మరో కొత్త ఎయిర్‌పోర్ట్

- మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- ఎయిర్‌పోర్టు విస్తరణకు 256 ఎకరాల భూ సేకరణ
- రూ.205 కోట్ల నిధులు విడుదల
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కల సాకారం
- పనులు వేగవంతమవుతాయన్న మంత్రి కోమటిరెడ్డి

వారధి, స్టేట్ బ్యూరో:



మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కి.మీ పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. జీఎంఆర్‌తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. దీంతో మామునూరుకు జీఎంఆర్ అంగీకారం తెలిపింది. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు.

ఎయిర్‌పోర్టు విస్తరణకు అవసరమైన 256 ఎకరాల భూ సేకరణకు రూ.205 కోట్లు విడుదల చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే జీవో విడుదల చేసింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి డిజైన్లతో కూడిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఎయిర్‌పోర్టు అథారిటీకి రోడ్లు, భవనాల శాఖ లేఖ రాసింది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు పరిధిలో 696 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమిలో కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ వెల్లడించింది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది.

**రాష్ట్ర ప్రభుత్వ చొరవ వల్లే కల సాకారం: మంత్రి కోమటిరెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవంతమవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# ముగిసిన కులగణన రీసర్వే

వారధి, స్టేట్ బ్యూరో:



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన రీ సర్వే ముగిసింది. ఇప్పటికే 3 కోట్ల 4 లక్షల మందికి పైగా వివరాలు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే కులగణన పూర్తి స్థాయిలో చేయలేదనే విమర్శలు రావడంతో మరో 12 రోజులపాటు కులగణన రీసర్వే చేయాలని నిర్ణయించింది ప్రభుత్వం. ఈ నెల 16వ తేదీ నుంచి నేటి వరకు 12 రోజుల పాటు రీ సర్వే కొనసాగింది. ఈ 12 రోజుల్లో కేవలం 15 వేల కుటుంబాలే సర్వేలో పాల్గొన్నట్టు సమాచారం. రెండో దఫా మొత్తం మూడు పద్ధతుల్లో వివరాలను ప్రభుత్వం సేకరించింది. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తమ వివరాలు పొందుపర్చుకోవడం, ప్రజాపాలనా సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు ఇవ్వడం, ఆన్ లైన్ లో ఫామ్ డౌన్ లోడ్ చేసుకుని కుటుంబ వివరాలు నమోదు చేసి ఆ వివరాలు ప్రజాపాలనా సేవా కేంద్రంలో సమర్పించడం ఈ మూడు పద్ధతుల్లో ఈసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

2024 నవంబర్ 6న ప్రారంభించి డిసెంబర్ 25 వరకు 50 రోజుల పాటు సాగిన తొలి దఫా సర్వేలో మొత్తం 1,15,71,457 కుటుంబాలకు గాను 1,12,15,134 కుటుంబాల(96.9 శాతం)ను సర్వే చేశామని సీఎం అసెంబ్లీలో వెల్లడించారు. అయితే ఇంకా 3.1 శాతం (3,56,323) కుటుంబాలను సర్వే చేయలేదని చెప్పారు. మిగిలిపోయిన వారి కోసం మరో అవకాశం ఇవ్వాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. అయితే మరోసారి అవకాశం కల్పించినా ఈ కుల గణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు పాల్గొనకపోవడం రాజకీయంగా ఆసక్తిగా మారింది. కాగా కేసీఆర్ ఫ్యామిలీలో కవిత ఒక్కరే తొలివిడత సర్వేలోనే తమ వివరాలను నమోదు చేసుకోగా రీ సర్వే నిర్వహిస్తే తాను కేసీఆర్ పాల్గొంటామని చెప్పిన కేటీఆర్.. రీ సర్వేలో మాత్రం పాల్గొనకుండా దూరంగా ఉన్నారు.



# మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

మొదటిపేజీ తరవాయి భాగం

సీఎస్ శాంతికుమారి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఇంటర్ బోర్డు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టాలని చెప్పారు. కాగా, తెలంగాణలో మార్చి 5 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. క్వశ్చన్ పేపర్లను ఆయా స్ట్రాంగ్ రూమ్‌లో నుంచి పోలీస్ స్టేషన్‌లోకి తరలించే ముందు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. రిసెప్షన్ సెంటర్లలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు ఉండాలని.. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సీఎస్ శాంతి కుమారి అధికారులతో అన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ని విధించాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థులు గాని పరీక్షా సిబ్బంది గానీ ఎటువంటి ఎలక్ట్రిక్ గ్యాడ్జెట్లను లోపలికి అనుమతించకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేసి, పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9, 96,971 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది.

# హరీశ్‌రావుపై మరో కేసు

వారధి, స్టేట్ బ్యూరో:



బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసు నమోదైంది. చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు నగరంలోని బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ మంత్రితో పాటు మరో ముగ్గురి నుంచి ప్రాణహాని ఉందని చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. దీంతో హరీశ్‌రావు, సంతోష్‌కుమార్, రాములు, వంశీపై కేసు నమోదైంది. హరీశ్‌రావుపై 351(2), ఆర్‌డబ్ల్యూ 3(5) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో రెండో నిందితుడిగా హరీశ్‌రావు పేరును పోలీసులు చేర్చారు.

**ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలు**

గతంలో హరీష్ రావుపై చక్రధర్‌గౌడ్ ఫోన్ టాపింగ్ ఆరోపణలు చేశారు. తన ఫోన్ ట్యాప్ చేసి తన భార్యతో, బంధువులతో జరిపిన ఫోన్ సంభాషణలను విన్నారని, కోర్టు చర్యలు తీసుకోవాలని పోలీసులతో పాటు న్యాయస్థానాన్ని సైతం చక్రధర్ గౌడ్ ఆశ్రయించడం తెలిపిందే. తాజాగా హరీష్ రావు సహా కొందరి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది.

# 8 మంది కార్మికులు మృతి..?

మొదటిపేజీ తరవాయి భాగం

మిషన్‌ను దక్షిణ మధ్య రైల్వే నిపుణులు ప్లాస్మా గ్యాస్ కట్టర్స్‌తో కట్ చేశారు. దీంతో.. టన్నెల్‌లోని బురద, శిథిలాల తొలగింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా.. గ్రౌండ్ పెనిట్రెటింగ్ రాడర్ (GPR) టెక్నాలజీతో కార్మికుల జాడ కోసం టన్నెల్‌లో స్కానింగ్ నిర్వహించారు. ఇందుకోసం జీపీఆర్ పరికరాన్ని సొరంగం లోపలికి పంపించగా.. పైకప్పు కూలిపడ్డ చోట మట్టి దిబ్బల కింద పరిశీలించగా.. ఐదు ప్రాంతాల్లో మెత్తటి భాగాలు గుర్తించినట్టు తెలుస్తోంది. సుమారు మూడు మీటర్ల లోతు మట్టిలో ఈ మెత్తని భాగాలు కనిపించినట్టు తెలుస్తోంది. అయితే.. ఆ మొత్తని భాగాలు మృతదేహాలేనని అధికారులు భావిస్తున్నారు. మొత్తని భాగాలు గుర్తించిన చోట.. తవ్వకాలు జరిపి మృతదేహాలను బయటికి తీసుకురానున్నట్టు తెలుస్తోంది.టన్నెల్ ప్రమాద స్థలంలో రక్షణ చర్యలను వేగవంతం చేసిన ప్రక్రియలో భాగంగా.. నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) ఆపరేషన్ ప్రారంభించింది. ఇందులో భాగంగా మట్టి దిబ్బల కింద 8 మంది కూరుకుపోయి ఉంటే వారి పరిస్థితిని తెలుసుకునేందుకు ఆధునాతన టెక్నాలజీ జీరో గ్రావిటీ పెనట్రేటింగ్ రాడార్ టెక్నాలజీ ద్వారా వారిని గుర్తించేందుకు ప్రయత్నాలు చేసింది. ఈ మిషన్ ఆధారంగా ఎన్జీఆర్ఐ బృందం టన్నెల్‌ను పూర్తిగా స్కాన్ చేసి మృతదేహాలను గుర్తించింది. ఇందులో ఐదు అనుమానాస్పద ప్రదేశాలను గుర్తించడంతో పాటు శరీర నిఘా కోసం మార్కింగ్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఐదు మృతదేహాలు మాత్రం మూడు మీటర్ల లోతులో కూరుకుపోయినట్లు తెలిసింది. మిగతా మూడు మృతదేహాలు ఎంత లోతులో ఉన్నది కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. అయితే.. ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో పైకప్పు కూలిన సమయంలో మట్టి దిబ్బలు వారిపైనే పడి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో.. 8 మందిలో ఏ ఒక్కరూ మిగలకుండా ప్రాణాలు వదిలి ఉంటారని భావిస్తున్నారు. 8 మందిలో.. ఆరుగురు కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. రెండు రోజుల్లో టన్నెల్ ఆపరేషన్ పూర్తి చేస్తామని ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఆయన చెప్పిన ప్రకారం నేటితో ఆపరేషన్ పూర్తి అయిపోతుంది. నేడు సాయంత్రం వరకు వారి మృతదేహాలను బయటకు తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**వారు బతికే అవకాశం లేదు: మంత్రి జూపల్లి**

ఎస్ఎల్‌బీసీ ఘటనపై మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన కామెంట్స్ చేశారు. అద్భుతం జరిగితే తప్ప టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది బతికే చాన్స్ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రకృతి విపత్తుని రాజకీయంగా వాడుకుంటుందని, హరీష్ రావు, కేసీఆర్ శవాల మీద పేలాలు ఏరుకుంటున్నారంటూ హాట్ కామెంట్స్ చేశారు. ఎస్ఎల్‌బీసీపై హరీష్ రావు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం అన్నారు. పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ ఎందుకు టన్నెల్ ను పెండింగ్ లో పెట్టిందని ప్రశ్నించారు. హరీష్ రావుకు సూటి ప్రశ్న? ఎందుకు 200 లోమీటర్లు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వి మిగతాది వదిలేసింద్రు? తక్కువ లాభం వస్తుందనా? ఎస్ఎల్‌బీసీ పూర్తి అయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందనా? ఈ మూడు ప్రశ్నలకు హరీష్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సహాయక చర్యలకు ఇంకా రెండు రోజులు పట్టే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరిగినప్పుడు కంపెనీ వాళ్ళు అలెర్ట్ చేయకపోతే 40 మంది వరకు చనిపోయే వారని మంత్రి జూపల్లి తెలిపారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

**పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి**




**వారధి న్యూస్,వనపర్తి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మార్చి 2న వనపర్తి పర్యటనకు రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. సభ విజయవంతం కావడానికి ఆయా మండలాల నాయకులతో సమావేశమై విశిష్ట ఆదేశాలు జారీ చేశారు.

**ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ :**
శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ జరగాలన్న ఉద్దేశ్యంతో, పట్టణం, మండలాల కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేకంగా చర్చించి, ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు.

**సీఎం పర్యటనలో ముఖ్యమైన కార్యక్రమాలు :**
ముఖ్యమంత్రి రాక సందర్భంగా నిర్వహించబోయే ముఖ్యమైన కార్యక్రమాలను ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులతో సమన్వయం చేస్తున్నారు. ముఖ్యంగా:

- వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజ కార్యక్రమం
- సీఎం విద్యాభ్యాసం చేసిన పార్వతమ్మ ఇంటి సందర్శన
- క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం
- జూనియర్ కళాశాల ఆవరణలో శంకుస్థాపన కార్యక్రమాలు

**సభ విజయవంతానికి నాయకులకు పిలుపు :**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో మొట్టమొదటిసారిగా రేవంత్ రెడ్డి వనపర్తి బహిరంగ సభకు హాజరవుతున్నారని, సభను అభూతపూర్వంగా విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయ కులు, మండలాల నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం బహిరంగ సభ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దిశానిర్దేశం

**వారధి న్యూస్, వనపర్తి ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మార్చి 2వ తేదీన వనపర్తి జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. బహిరంగ సభకు పట్టణంలోని 33 వార్డుల నుండి భారీ స్థాయిలో ప్రజలను తరలించాలని, ప్రతి వార్డు నుండి కనీసం లక్ష్యంగా నిర్దేశించిన సంఖ్యను తరలించాల్సిందిగా నాయకులకు సూచనలు ఇచ్చారు.

**బహిరంగ సభ విజయవంతానికి సమన్వయం :**
వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, నియోజకవర్గ సమన్వయకర్తలు కాకుల సతీష్, మాజీ మున్సిపల్ చైర్మన్లు పుట్టపాక మహేష్, పాకనాటి కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, ఇతర వార్డుల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపు :**
ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా సాగుతోందని, వనపర్తికి ఆయన వచ్చే ఈ చారిత్రక సందర్భాన్ని ప్రజలు కూడా స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోంది. సీఎం పర్యటనలో వనపర్తికి అనేక ప్రాజెక్టులు, కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలుకుతుందన్నారు. బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరై పార్టీ బలోపేతానికి ప్రజలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు భారీగా హాజరై సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు.



## సీఎం పర్యటనకు పటిష్ట భద్రత ఏర్పాట్లు

- హెలిప్యాడ్, బహిరంగ సభ స్థలాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**వారధి న్యూస్,వనపర్తి ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మార్చి 2న వనపర్తి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రాంతాన్ని శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ పరిశీలించారు. వాహనాల పార్కింగ్, బారికేడింగ్, భద్రతా ఏర్పాట్లు వంటి విషయాలను సమీక్షించి, పర్యటన సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సీఎం పర్యటన భద్రతా చర్యలు :**
వీఐపీలు, ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ , సభా ప్రాంగణం చుట్టూ బారికేడ్ల నిర్మాణం, అవసరమైన చోట భద్రతా సిబ్బందిని మోహరింపు లాంటి చర్యలను తీసుకోవాలని ఎస్పీ అదేశించారు.

**అధికారులకు స్పష్టమైన ఆదేశాలు :**
ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ, సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీస్ శాఖ సహా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, బీసీఆర్బీ డీఎస్పీ ఉపమామహేశ్వరరావు, వనపర్తి సీఐ కృష్ణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, సీసీఎస్ సీఐ రవిపాల్, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై జేలెందర్ రెడ్డి, గోపాల్ పేట్ ఎస్సై నరేష్, చిన్నంబావి ఎస్సై జగన్, ట్రాఫిక్ ఎస్సై సురేందర్ పాల్గొన్నారు.

## ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పురుషుల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

**వారధి న్యూస్, వనపర్తి ప్రతినిధి :**
సిల్వర్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో మార్చి 7,8,9 తేదీలలో సిల్వర్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో దివంగత నారమ్మ గారి నర్సిరెడ్డి శంకరమ్మ స్మారక ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పురుషుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు సిల్వర్ జూబ్లీ క్లబ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించబడుచున్నది. కావన ఆసక్తి గల క్రీడాకారులు పేర్లను 5 తేదీ సాయంకాలం 5 గంటల వరకు నమోదు చేసుకోవచ్చునని నిర్వాహకులు తెలిపారు. ఎంట్రీ ఫీ డబుల్స్ 1000 ,సింగిల్స్ 600 సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ శ్రావణ్ కుమార్ రెడ్డి 9666349900,కే బలరాం 7095 851811,ఎస్ మేఘ శ్యామ్ రెడ్డి 970 5997 549 బహుమతుల వివరాలు డబుల్సు మొదటి బహుమతి 40,000 వేలు రెండో బహుమతి 20,000 వేలు మూడో బహుమతి 10,000 వేలు నాలుగవ బహుమతి 5,000 వేలు సింగిల్స్ మొదటి బహుమతి 25,000 వేలు రెండో బహుమతి 15,000 వేలు మూడో బహుమతి 8,000 వెలు నాలుగో బహుమతి 4, 000 వేల రూపాయలు 40 సంవత్సరాల పైబడిన ఆటగాళ్లు మొదటి బహుమతి 20,000 వేలు రెండో బహుమతి 12,000 వేలుమూడో బహుమతి 8,000 వేలు నాలుగో బహుమతి 4,000 వేల రూపాయలు అందిస్తామని ప్రకటించారు. నియమ నిబంధనలు మావిస్ 350 షటిల్ కాక్స్ తో టోర్నమెంట్ నిర్వహించబడునని సింగిల్స్ ఇంటర్నేషనల్ స్కోర్ తో డబుల్స్ నేషనల్ స్కోర్ తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంపైర్ నిర్ణయం తుది నిర్ణయం అన్నారు. క్రీడాకారులందరూ సమయపాలన పాటించాలని ,లేనిచో టోర్నమెంట్ నుంచి తొలగించబడునని తెలిపారు.ఈ టోర్నమెంటు నాకౌట్ పద్ధతిన నిర్వహించబడును.భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు నేషనల్ మెడల్స్ పొందిన వారికి ప్రవేశం లేదు ప్రూఫ్ అడ్రస్ డేట్ అఫ్ బర్త్ కొరకు ఆధార్ కార్డు ఒరిజినల్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు



## బల్మూరు మండలం కొండనాగుల ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు భోజనం పెట్టలేదనేది అవాస్తవం

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో :**
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లోని బలమూరు మండలం కొడనాగుల గ్రామంలోని గిరిజన బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మహాశివరాత్రి రోజు భోజనాలు పెట్టకుండా హాస్టల్ సిబ్బంది ఇబ్బంది పెట్టారని అనేది వాస్తవం లేదని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. విద్యార్థులు మహాశివరాత్రి రోజు ఉపవాస దీక్ష చేపట్టి దేవుని దర్శనం కోసం వెళ్లి అక్కడ అన్నప్రసాదం తీసుకున్నది వాసవినని ఇది ఆనవాయితీగా కొన్ని ఏళ్ల నుండి జరుగుతుందని అన్నారు. హాస్టల్లో వంట వండకపోవడంతోనే అక్కడ వెళ్లి విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడ్డారని జరిగిన ప్రచారంలో ఎలాంటి వాసం లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు ఆరోజు భోజనాలు వండలేదు అనేది నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ఆయన టిఆర్ఎస్ నేత కేటీఆర్ కు సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన కొండనాగుల ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.కొండనాగులలో బాలుర ఎస్టి వసతి గృహంలో విద్యార్థులు పస్తులు ఉంటున్నారని తప్పుడు సమాచారంతో క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకోలేని... అసమర్థత ప్రతిపక్ష నాయకుడు కేటీఆర్తన ట్విట్టర్ వేదికగా వాస్తవం తెలుసుకోకుండా ప్రజా ప్రభుత్వాన్ని బదనం చేయాలని కుట్రలో భాగంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు.కొండనాగుల బాలుర ఎస్టి వసతిగృహంలో ఉన్నటువంటి కొంతమంది విద్యార్థులు శివరాత్రి పండుగ సందర్భంగా ఉపవాసం ఉండడం జరిగింది కొంతమంది విద్యార్థులు స్థానికంగా ఉండే గంగమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన ఉపవాస కార్యక్రమానికి హాజరైనారు. మిగిలిన విద్యార్థులు వసతి గృహం లోనే భోజనం ఏర్పాటు చేయడమైనది వాస్తవం తెలుసుకోకుండా ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని ఉద్దేశంతో కేటీఆర్ ట్విట్టర్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బిఆర్ఎస్ 10 సంవత్సరాల కాలంలో సంక్షేమ వసతి గృహాలు గురుకుల గురుకులాలను పట్టించుకునే నాధుడే లేడన్నారు. ఇప్పుడు ఈ యొక్క ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థులకు మేస్ చార్జీలు గాని కాస్మోటిక్ చార్జీలను పెంచి వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు వాస్తవం తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారు ఇప్పటికైనా బుద్ధిమానుకొని క్షేత్రస్థాయిలో వచ్చి పరిశీలన చేసి మాట్లాడితే బాగుంటుందని కేటీఆర్ కు హెచ్చరిస్తున్నాం.

ఈ కార్యక్రమంలో డి టి డబ్ల్యూ వార్డెన్లు స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు మండల నాయకులు పాల్గొన్నారు.



## బిజ్వార్ పాఠశాలలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**వారధి న్యూస్, నారాయణపేట:**
నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని (సైన్స్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు, సర్ సీవీ రామన్ కు సంబంధించిన చిత్ర ప్రదర్శన, ఉపన్యాస పోటీలు నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

**విద్యార్థుల సృజనాత్మకత ఆకర్షణగా నిలిచింది:**
ఈ కార్యక్రమంలో విద్యార్థులు వినూత్నంగా సీవీ రామన్ పేరును ఆంగ్ల అక్షరాలతో మానవహారంగా రూపొందించి అందరినీ ఆకట్టుకున్నారు. అలాగే, భౌతిక శాస్త్రంలోని ముఖ్యమైన సిద్ధాంతాలను వివరిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

**పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం :**
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు గోపాల్, నాగరాజు, గజలప్ప, హర్షద్ మనోహర్, నరేష్, స్నేహ పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విజ్ఞానాన్ని అధ్యయనం చేయడమే కాకుండా, దాన్ని జీవితంలో అన్వయించుకోవాలని, సైన్స్ డే విద్యార్థులకు పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





## అధికారం ఉంటేనే ప్రజల మధ్యన... లేకుంటే ప్రజలకు దూరంగా....

- కనుమరుగైన మాజీ ఎంపీ , మాజీ ఎమ్మెల్యే
- వారి పార్టీ నాయకుల శుభకార్యాలకు పరిమితమైన మాజీ నేతలు

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:**
భారత రాష్ట్ర సమితి (టిఆర్ఎస్ ) తెలంగాణ సెంటిమెంట్ తో 2014లో అధికారంలోకి వచ్చింది. 10 ఏళ్లు అధికారంలో ఉన్నారు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అధికారం కోల్పోయారు. నాగర్ కర్నూలు జిల్లాలో భారత రాష్ట్ర సమితి పార్టీకి చెందిన నలుగురు నాగర్ కర్నూల్ కొల్లాపూర్ కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు ఓడిపోయారు. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గోరంగా 50 వేల ఓట్లతో డాక్టర్ వంశీకృష్ణ చేతిలో ఓడిపోయారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులుగా మల్లు రవి చేతిలో బిఆర్ఎస్ రాములు ఓడిపోయారు.

పది ఏళ్లు అధికారం ఇచ్చిన ప్రజలను మాజీ ఎంపీ రాములు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజులు మర్చిపోయారు. వారి సంక్షేమం,, పథకాలు లబ్ది పైన పూర్తిగా మర్చిపోయారాని నాగర్ కర్నూల్ జిల్లాలో చర్చ జరుగుతుంది. అధికార అహంకారంతోనే వారికి నల్లమల్ల అచ్చంపేట నియోజకవర్గం ప్రజలు తగిన బుద్ధి చెప్పారని జోరుగా చర్చ జరుగుతుంది. అప్పుడప్పుడు వారి పార్టీ ముఖ్య నాయకుల కుటుంబ సభ్యులలో జరుగుతున్న శుభకార్యాలకు హాజరవుతూ కాలక్షేమం చేస్తున్నా అనే వాదనలో వినిపిస్తున్నాయి.కాంగ్రెస్ ప్రజా పాలన వ్యవస్థ పైన వంతుకు దంచేసే విధంగా విమర్శలు చేస్తున్నారని పలు రాజకీయ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. దళిత బందు పేరుతో 10 లక్షలు కొందరు మాత్రమే మాత్రమే గువ్వల బాలరాజుకు సానుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల పేరు చెబుతూ అధికారులకు వచ్చింది. చెప్పిన పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇది విధానాల పైన అచ్చంపేటలో బాలరాజు ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేయడం లేదు. అధికారం పోగానే ఎన్నికల్లో ఓడిపోగానే ప్రజలకు దూరం అవడం సరైన పద్ధతి కాదని రాజకీయ పార్టీ కార్యకర్తలు నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రజా సంక్షేమ పైన ఇప్పటికైనా మాజీ ఎంపీ ఎమ్మెల్యే తమ బాధ్యతను నిర్వహించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అధికారం ఉంటేనే ప్రజల మధ్యన అధికారం లేకపోతే ప్రజలకు దూరంగా వారి కష్టనష్టాలు తెలుసుకోకుండా ఉండటం ఏమిటని జిల్లాలో జోరుగా సదరు పార్టీ నాయకులపై చర్చ జరుగుతుంది.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక





## పిల్లలపై ఒత్తిడి లేకుండా ప్రేమతో ప్రోత్సహించాలి – RJDSE విజయలక్ష్మి

వారధి న్యూస్, నారాయణపేట:

పదవ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల సన్నాహకాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "తలుపు తట్టండి" కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా మరికల్ మండలం మాద్వార్ గ్రామంలో ఆరంభించారు. ఉదయం 6 గంటల నుండి 8 గంటల మధ్య ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లను సందర్శించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. RJDSE విజయలక్ష్మి మాట్లాడుతూ, తల్లిదండ్రులు విద్యార్థులకు ఇంటి పనులు చెప్పకుండా, రాబోయే 20 రోజులు పూర్తిగా చదువుపై దృష్టి పెట్టేలా చూడాలన్నారు. పిల్లల ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమని, ఒత్తిడిని పెంచకుండా ప్రేమతో ప్రోత్సహించాలన్నారు. పాల్గొన్న తల్లిదండ్రులు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఇళ్లకు రావడం తమకూ బాధ్యతను గుర్తు చేసిందని, విద్యార్థులు కూడా ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సందేహాలను ఉపాధ్యాయులతో నిస్సంకోచంగా పంచుకుని, మరింత కాన్ఫిడెంట్ గా పరీక్షలు రాయాలన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలు :**

నారాయణపేట జిల్లాలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు "తలుపు తట్టండి" కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు, తల్లిదండ్రుల బాధ్యత గుర్తు చేయడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజు, ఏఎంఓ విద్యాసాగర్, ఎమ్ఈఓ మనోరంజని, జీహెచ్ఎం నాగరత్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు

- పకడ్బందీగా పరీక్షల నిర్వహణ, వీడియో కాన్ఫరెన్స్ లో సిఎస్ కు వివరించిన జిల్లా కలెక్టర్

వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో :




జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ మరియు LRS"తదితర అంశాల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత జిల్లా అధికారులు, అదనపు కలెక్టర్ దేవ సహాయం, తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.............. మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో 33 పరీక్షా కేంద్రాల్లో 13,454 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 6,477, సెకండ్ ఇయర్ 6,977 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టామని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి కస్టోడియన్, మరియు డిపార్ట్మెంటల్, అధికారులను నియమించామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని వివరించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించినట్లు, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తగిన మందులతో మెడికల్ ఆఫీసర్, ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించినట్లు తెలిపారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు అధికారులకు సూచనలు చేసినట్లు వివరించారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కి జిల్లా కలెక్టర్ వివరించారు.

## జాతీయ లోక్ అదాలత్ – రాజీమార్గమే రాజమార్గం

వారధి న్యూస్, నారాయణపేట:

వివాదాలను పెంచుకుంటూ పోతే అవి జీవితకాలం కొనసాగుతాయి, కానీ రాజీకి రాగా వెంటనే పరిష్కారం అవుతాయని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రాజీపడదగిన కేసుల్లో ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీ వరకు నారాయణపేట, కోస్గి కోర్టుల్లో 'నేషనల్ లోక్ అదాలత్' నిర్వహించనున్నారు. ఈ లోక్ అదాలత్‌లో యాక్సిడెంట్, చిన్నచిన్న దొంగతనాలు, చీటింగ్, వివాహ సంబంధిత వివాదాలు, కొట్టుకున్న కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, కరోనా సమయంలో నమోదైన కేసులు మరియు ఇతర రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చు. మీపై కేసు ఉంటే, ఆధార్ కార్డు తీసుకుని సంబంధిత కోర్టులో హాజరైతే, కేసును పూర్తిగా క్లోజ్ చేసే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు.





## వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి

- బీసీ పొలిటికల్ జెఎసి
- బీసీ ఎమ్మెల్యేలపై కుట్రలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు

**వారధి న్యూస్, వనపర్తి ప్రతినిధి :** మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డికు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాలులో బీసీ పొలిటికల్ జెఎసి వనపర్తి జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

**బీసీ ఎమ్మెల్యేలపై కుట్రలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు :**

కొంతమంది కావాలనే బీసీ ఎమ్మెల్యేలపై నిరాధార ఆరోపణలు చేస్తూ, సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మక్తల్ ఎమ్మెల్యేపై బూటకపు లేఖలు రాస్తూ, అపవాదులు ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి చిల్లర పనులు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

**బీసీల హక్కుల కోసం పోరాటం :**

బీసీలకు ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కుల గణన చేపట్టిన ప్రభుత్వం, చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలు హర్షణీయం అని చెప్పారు. మార్చి 2న సీఎం రేవంత్ రెడ్డి వనపర్తి పర్యటనలో బీసీ పొలిటికల్ జెఎసి తరఫున పలు విజ్ఞప్తులు చేయనున్నామని చెప్పారు. ముఖ్యంగా, వనపర్తి సమీకృత గురుకులం, 500 పడకల ఆసుపత్రికి దివంగత బీసీ ఎమ్మెల్యేల పేర్లు పెట్టాలని కోరారు.

**దివంగత బీసీ నేతల పేరిట నూతన ప్రాజెక్టులు :**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు మూలమల్లు జయరాములు యాదవ్ పేరు, 500 పడకల ఆసుపత్రికి డా. బాలకష్టయ్య ముదిరాజ్ పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి వినతిపత్రం అందించగా, ఆయన సానుకూలంగా స్పందించారని, ఈ పేర్లను ఖరారు చేసేందుకు సీఎంతో చర్చిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

**స్థానిక ఎన్నికల్లో బీసీ జెఎసి అభ్యర్థులు :**

నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీసీ నాయకులకు అన్యాయం జరిగింది అని పేర్కొంటూ, త్వరలో భర్తీ చేయబోయే పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి మార్చి 9న మదనాపూర్ నుండి "మార్నింగ్ వాక్" చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు & పంచాయతీ ఎన్నికల్లో బీసీ పొలిటికల్ జెఎసి తరఫున అభ్యర్థులను పోటీకి దింపుతామని ప్రకటించారు.

**బీసీ పొలిటికల్ జెఎసి కొత్త నియామకాలు :**

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు: స్వప్న
జిల్లా ఉపాధ్యక్షుడు: గూడుషా
మాదనాపూర్ మండల కన్వీనర్: నరసింహ యాదవ్
మండల వర్కింగ్ ప్రెసిడెంట్ : నరేష్
నెల్విడి గ్రామ అధ్యక్షుడు: విజయ్

ఈ కార్యక్రమం లో బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, ఇతర నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా జరగాలి

– జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వారధి న్యూస్, వనపర్తి ప్రతినిధి:

రాష్ట్ర ముఖ్యమంత్రి వనపర్తి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మార్చి 2వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో, శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ యాదయ్య, డీఎస్పీ వేంకటేశ్వరరావు తదితర అధికారులు కే.డి. ఆర్. పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, "బహిరంగ సభకు హాజరయ్యే రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల కోసం అవసరమైన వసతులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి" అని సూచించారు. సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఏర్పాట్లను పరిశీలించారు.




## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యం

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ సౌభాగ్య లక్ష్మి

వారధి న్యూస్, నారాయణపేట:

ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతమైన పదవుల్లో పని చేస్తుంటే, ఉద్యోగ విరమణ (రిటైర్మెంట్) అనేది ఒక అనివార్యమైన దశ అని నారాయణపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ సౌభాగ్య లక్ష్మి అన్నారు.

**సునంద సేవలను కొనియాడిన జిల్లా వైద్యాధికారి**

నారాయణపేట మండలం కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) లో P.H.N. (పబ్లిక్ హెల్త్ నర్స్) గా సేవలందించిన సునంద రిటైర్మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, ఆమె చేసిన సేవలను ప్రశంసించారు. కోవిడ్ 19 మహమ్మారి సమయంలో సునంద విశేష సేవలందించారని కొనియాడారు. ఇలాంటి అనుభవజ్ఞులైన వైద్య సేవకులు పదవీ విరమణ చేయడం వైద్య రంగానికి తీరని లోటు అని అన్నారు. సునంద భవిష్యత్తులో కుటుంబ సభ్యులతో సుఖ, సంతోషాలతో గడపాలని ఆకాంక్షిస్తూ ఉద్యోగ విరమణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శైలజ, కోటకొండ పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రతిభా, డాక్టర్ శిరీష, రిటైర్డ్ ఉద్యోగి భద్రప్ప, వైద్య సిబ్బంది అశోక్ కుమార్, గోవిందరావు, ల్యాబ్ టెక్నీషియన్ దశరథ్, రాజేష్, ANM ముస్కాన్ బేగం, స్టాఫ్ నర్సులు పరమేశ్వరి, నిర్మల, సూపర్వైజర్ సరస్వతి, ఫార్మసిస్ట్ వెంకటేష్, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.



## ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేష్ కుటుంబానికి బ్యాచ్ మిత్రుల ఆర్థిక సహాయం

వారధి న్యూస్, మహబూబ్నగర్:

విధులు నిర్వర్తిస్తుండగా గుండె పోటుతో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేష్ (PC 3274) కుటుంబానికి బ్యాచ్ మిత్రులు కలిసి ఆర్థిక సహాయం అందించారు. జిల్లా ఎస్పీ డీ. జానకి, ఐపీఎస్ చేతుల మీదుగా వెంకటేష్ భార్య కె. వనితకు లక్ష రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, బ్యాచ్ మిత్రులు చేసిన స్ఫూర్తిదాయక సహాయాన్ని ప్రశంసించారు. పోలీస్ శాఖ ఎప్పుడూ వెంకటేష్ కుటుంబానికి మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ కృష్ణయ్య, బ్యాచ్ మిత్రులు రఘు, నరేందర్, లక్మా రెడ్డి, ఇతర ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఏఆర్ ఆర్ఎస్ఐ ఎండీ అసదుల్లా పదవి విరమణ

వారధి న్యూస్, మహబూబ్నగర్ :

41 సంవత్సరాలు 3 నెలల పాటు పోలీస్ శాఖలో విశేష సేవలు అందించిన ఏఆర్ ఆర్ఎస్ఐ ఎండీ అసదుల్లా కు మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి ఐపీఎస్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ , అసదుల్లా నిజాయితీ, క్రమశిక్షణ, పట్టుదలతో సేవలందించి నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. అనంతరం, శాలువాతో సత్కరించి, మేమెంటోను అందజేశారు. భావోద్వేగంగా స్పందించిన అసదుల్లా, పోలీస్ శాఖలో పని చేయడం గర్వంగా అనిపించిందని, ప్రజాసేవే తన ధ్యేయమని, సహచరుల నుంచి పొందిన సహకారం మరచిపోలేనిదని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డిసిఆర్బి డిఎస్పీ రమణా రెడ్డి, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, ఏఓ రుక్మిణీ బాయి, ఎస్పీ సీసీ రాంరెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, రవి, ఇతర పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## 30 పడగల ఆసుపత్రికు జీవో కాఫీ విడుదల చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- **హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు**

పెబ్బేరు, వారధి న్యూస్ :

వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రానికి 30 పడగల ఆసుపత్రి మంజూరు అయిన జీవో కాపీని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తూ డి మేఘారెడ్డి జీవో కాపీని విడుదల చేశారు.ఈ సందర్భంగా పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పెబ్బేరు పట్టణానికి 30 పడకల ఆసుపత్రి మంజూరు చేసినందుకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో పెబ్బేరులో 30 పడకల ఆసుపత్రి అవసరమని తూడి మేఘారెడ్డి మంజూరు చేయడం జరిగిందని,14 నెలల నుంచి పెబ్బేరు మండలానికి నిధులలో ప్రత్యేకమైన పెద్దపీట వేయడం జరుగుతుందని,పెబ్బేరు మండలంపై ప్రత్యేక దృష్టి సాధించి పెబ్బేరు మండలానికి 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయించినందుకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ్మ,నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవికి ప్రత్యేక చొరవ తీసుకొని ఆసుపత్రి మంజూరుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డికి మండల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి,రంగాపురం రాంచంద్రారెడ్డి ,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్,బూరమోని రాములు యాదవ్,యుగేందర్ రెడ్డి,మాజీ డైరెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించాలి – జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు

- **నారాయణ ఈ-టెక్నో స్కూల్‌లో అకాడమిక్ ఫెయిర్-2025 విజయవంతం**

వారధి న్యూస్, వనపర్తి:

జిల్లా కేంద్రంలోని నారాయణ ఈటెక్నో స్కూల్‌లో అకాడమిక్ ఫెయిర్2025 ఘనంగా నిర్వహించబడింది. ఈ ప్రదర్శనలో విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ప్రయోగాత్మక అంశాలను రూపొందించి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సందర్శకులకు వివరించారు. విద్యార్థుల రీసెర్చ్ మైండ్, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రదర్శించే ఈ ఫెయిర్ అందరి దృష్టిని ఆకర్షించింది.



**విద్యార్థుల విజ్ఞానానికి పునాది – శ్రీనివాసులు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ, "ఇలాంటి ఫెయిర్‌లు విద్యార్థుల్లో విజ్ఞానానికి పునాది వేస్తాయి. ప్రాక్టికల్ నాలెడ్జ్ ద్వారా పిల్లలు సైన్స్‌ను గమనించి, అర్థం చేసుకోవడమే కాకుండా, తమ సృజనాత్మకతను ప్రదర్శించే అవకాశం పొందుతారు" అని పేర్కొన్నారు. అలాగే, భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు.

**సృజనాత్మకతకు వేదిక – గోపాల్ రెడ్డి**

నారాయణ స్కూల్స్ జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, "మా విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, గణితం, సాంఘిక శాస్త్రం వంటి అన్ని రంగాల్లోనూ వారి నైపుణ్యాన్ని చూపిస్తున్నారు. విజ్ఞానపరంగా ఇలాంటి ప్రయోగాలు చేయడం ద్వారా వారి సృజనాత్మకత మరింత పెరుగుతుంది" అని అన్నారు.

**పరిశోధనాత్మక ఆలోచనలకు మద్దతు – వెంకట రమణ రెడ్డి**

డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ, "ఈ ఫెయిర్ ద్వారా విద్యార్థుల పరిశోధనా ఆలోచనలకు సహకారం అందించాం. సైన్స్, మేథమేటిక్స్, టెక్నాలజీ రంగాల్లో వారు మరింత చొరవ చూపేలా ప్రోత్సహించాం. భవిష్యత్తులో మరింత శ్రద్ధ వహించి, పిల్లలు ప్రపంచ స్థాయి ప్రతిభను ప్రదర్శించేలా మార్గదర్శనం అందిస్తాం" అని తెలిపారు.

**శాస్త్రవేత్తలుగా ఎదగాలి – వెంకట్ రెడ్డి**

అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రయోగాత్మక అధ్యయనం ద్వారా విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుంది. పిల్లలు పుస్తకాలకే పరిమితం కాకుండా, ఆచరణాత్మకంగా ప్రయోగాలు చేస్తేనే నిజమైన విజ్ఞానం సాధ్యమవుతుంది. ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల స్థాయిలోనే శాస్త్రవేత్తల్ని తయారు చేయగలవు" అని అభిప్రాయపడ్డారు.

**విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు**

ఈ ఫెయిర్‌లో విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులు, మేథమెటిక్స్ మోడల్స్, సోలార్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ టెక్నాలజీస్, రోబోటిక్స్ వంటి అంశాలను ప్రదర్శించారు. వర్షపు నీటి సంరక్షణ, ప్రాక్టికల్ ఎలక్ట్రిసిటీ, సముద్రజలాన్ని తాగునీటిగా మార్చే పద్ధతులు, వ్యర్థ పదార్థాలను ఉపయోగించి కొత్త ఉత్పత్తులను తయారు చేయడం వంటి ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

**తల్లిదండ్రుల ప్రశంసలు**

ఫెయిర్ సందర్శించిన తల్లిదండ్రులు, "ఇలాంటి విద్యా కార్యక్రమాలు పిల్లల భవిష్యత్తుకు చాలా ఉపయోగకరమైనవి. పుస్తకాలకే పరిమితం కాకుండా, నిజమైన ప్రాయోగిక విజ్ఞానాన్ని అలవరచుకోవడం ఎంతో అవసరం" అని అభిప్రాయపడ్డారు .ఈ కార్యక్రమంలో ఆర్&డి టీం సభ్యులు అనిల్, స్వాతి, సంగీత, ప్రిన్సిపల్ రామ్మూర్తి, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. ఫెయిర్ విజయవంతంగా ముగియడానికి టీచర్లు ముఖ్య భూమిక పోషించారు.



## ఇంటర్ పరీక్షల కోసం కట్టుదిట్టమైన చర్యలు – సీఎస్ శాంతి కుమారి

వారధి న్యూస్,నారాయణపేట:

రాష్ట్రవ్యాప్తంగా మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు.ప్రశ్నపత్రాల భద్రత కోసం స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి పోలీస్ స్టేషన్లకు ప్రశ్నపత్రాలను తరలించేందుకు కఠిన భద్రతా చర్యలు చేపట్టినట్టు ఆమె తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో 144 సెక్షన్ అమలు చేసి, కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది ఎవ్వరూ సెల్‌ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్షా కేంద్రాలకు తెచ్చుకోవద్దని స్పష్టం చేశారు.పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థుల సౌలభ్యార్థం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్‌గౌతమ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పిడిఎస్ బియ్యం పట్టివేత.

వారధి న్యూస్_ ఆత్మకూర్.,

అమరచింత మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 10:45 ప్రాంతంలో రోడ్డుపై కాళికామాత గుడి దగ్గర, గొల్ల గేరి నందు పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా వ్యాన్లో తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం ప్రకారం అక్కడికి వెళ్లి పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు. కోరి కృష్ణ, అమరచింత వాసిని అదుపులోకి తీసుకున్నట్టు వారి పేర్కొన్నారు. ఇటి బియ్యం 4,930 కేజీలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇది బియ్యంపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.



## అక్రమ కట్టడాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి. సిపిఐ.

వారధి న్యూస్_ ఆత్మకూరు.,

అక్రమ కట్టడాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఏఐటియుసి ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం కొనసాగుతున్నది. ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ భూములను,స్థలాలను, రోడ్లను కబ్జాలు చేస్తున్న భూమాఫియా ఆగడాలపై, మాజీ ఎంపీపీ బంగారు శ్రీను పై చర్యలు తీసుకోవాలని సిపిఐ నేతృత్వంలో జరుగుతున్న నిరవధిక నిరసన శుక్రవారం కూడా కొనసాగింది. నిరవధిక నిరసనలు భాగంగా శుక్రవారం ఆత్మకూరు తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. అనంతరం తాసిల్దార్ చాంద్ పాషాకి వినతి పత్రం అందజేశారు.

నిరవధిక నిరసన శిబిరంలో సిపిఐ జిల్లా నాయకులు కే.మోష అధ్యక్షత వహించగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పి.శ్రీహరి మాట్లాడుతూ : ఆత్మకూరులోని బాబా కాలనీలో అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా దౌర్జన్యంగా నిర్మిస్తున్న బంగారు శ్రీను షాపు కాంప్లెక్స్ ను వెంటనే నిలుపుదల చేయాలని, నిర్మాణానికి వెనక ఉండి సహకరిస్తున్న ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టిపిఓ )లను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఆత్మకూర్ పట్టణంలో వెలసిన అనేక వెంచర్ల యొక్క 10% భూమి వివరాలు పూర్తిగా ఇవ్వాలని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అవి ఆయా కాలనీల ప్రజల మౌలిక వసతులకు వినియోగించాలని అది చట్టబద్ధంగా జరగాలని కోరారు. పై డిమాండ్స్ పరిష్కరించే వరకు ఈ యొక్క నిరసన శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శిక విజయరాములు మాట్లాడుతూ: పట్టణంలో మాజీ ఎంపీపీ ప్రముఖ రాజకీయ నేత ధన బలంతో అంగ బలంతో ప్రభుత్వ భూములపై పవిత్రమైన ముస్లిం కబ్రస్తాన్ మరియు ప్రజలకు సంబంధించిన రోడ్లను ఏ ఒక్కటి వదలకుండా కబ్జాలు పెడుతూ అక్రమ కట్టడాలు నిర్మాణం చేస్తున్నారని వీటిపై ప్రభుత్వ అధికార యంత్రాంగానికి ఎన్ని ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోవడం ఆశ్చర్యం అని అన్నారు. బంగారు శీను పై క్రిమినల్ కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఏ. భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్, డి హెచ్ పి యస్ జిల్లా కార్యదర్శి ఎ. రవీందర్,మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి గీతమ్మ, ఏఐటీయూసీ నేత శ్యాంసుందర్, సిపిఐ నాయకులు కార్యకర్తలు లక్ష్మీనారాయణ,సౌలు, బాలస్వామి, బాలరాజు బాలకృష్ణ భారతి, కృష్ణమ్మ నాగమ్మ, మాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన అభిమన్యు రెడ్డి

మహబూబ్ నగర్, వారధి న్యూస్:

రాజాపూర్ మండలం మోత్కూలకుంట గ్రామపంచాయతీలో అనారోగ్యంతో మృతి చెందిన సభవాట్ కేశ్య (55) కుటుంబానికి బీఆర్ఎస్ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ. 5000/ సహాయాన్ని యువసేన సభ్యుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవినాయక్, శ్రీనివాస్ నాయక్, సతీష్ రాథోడ్, బాధ్య నాయక్, ధర్మయ్య నాయక్, టోప్యా నాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి జాతర పనులను వేగవంతం చేయండి

**ఎమ్మెల్యే వంశీకృష్ణ**

వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:

నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలం శ్రీ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రాయల గండి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను వేగవంతంగా చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన రాయల గండి చెన్నకేశవ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం పాలక మండలి సభ్యులతో ఆయన మాట్లాడుతూ మార్చి మూడు నుండి ఆరు వరకు జరిగే ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు దేవాలయం పరిసరాల్లో ఎలాంటి అసౌకర్యం జరగకుండా అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

www.varadhinews.com
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్



## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

**– జిల్లా కలెక్టర్**


నారాయణపేట, వారధి న్యూస్:

నారాయణపేట మండలం లింగంపల్లి శివారులోని సర్వే నెంబర్ 30లో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఉదయం కలెక్టర్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి, జనవరి 21, 2025న రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాల్సిందిగా అధికారులకు సూచించారు. సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ కోసం సంబంధిత ఏర్పాట్లు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

ఈ పరిశీలన సందర్భంగా డిప్యూటీ ఇంజనీర్ రాము, తహసీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# పెబ్బేర్ బైపాస్ లో ఘోర రోడ్డు ప్రమాదం

**ఒకరు మృతి**

వారధి న్యూస్, పెబ్బేరు :

రెండు కార్లు అతివేగంగా, నిర్లక్ష్యంగా వెహికిల్స్ నడిపి పరస్పరం ఢీకొని డివైడర్ ఎక్కి మరో బస్సును ఢీ కొట్టాయి. దీంతో ఒక కారులో ఉన్న ఓ వ్యక్తి స్పాట్ డెడ్ అవ్వగా.. ప్రైవేటు బస్సులో ప్రయాణించే 30 మందికి తీవ్ర గాయాలు అయిన ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలోని రంగాపూర్ బైపాస్ వద్ద నేషనల్ హైవేపై శుక్రవారం సాయంత్రం జరిగింది. పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరుకు చెందిన ముష్టి విష్ణు(35), తన కుటుంబంతో, మరో కారులో 8 మంది మహబూబ్నగర్ వైపు వెళ్తున్నారు. అదేవిధంగా హైదరాబాద్లోని వనస్థలిపురానికి చెందిన ఓ పెళ్లి బృందం 40 మంది ప్రైవేటు ట్రావెల్స్లో తిరుపతికి వెళ్తున్నారు. పెబ్బేరు సమీపంలోని రంగాపూర్ బైపాస్లో నేషనల్ హైవే 44పై మహబూబ్నగర్ వైపు వెళ్తున్న రెండు కార్లు అతివేగంగా, అతి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి పరస్పరం ఢీకొట్టుకొని డివైడర్ పైకి ఎక్కి తిరుపతి వైపు వెళ్తున్న పెళ్లి బస్సును ఢీ కొట్టాయి. దీంతో బస్సు డివైడర్ పైకి దూసు కెళ్లింది. ప్రమాదంలో పెబ్బేరు పట్టణానికి చెందిన ముష్టి విష్ణు(35) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య పరిస్థితి విషమంగా ఉంది. కుమారుడికి కాలు విరగగా.. ఇద్దరు కుమార్తెలు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. అదేవిధంగా మరో కారులో సైతం 8 మందితో వెళ్తున్న కుటుంబ సభ్యులు కూడా గాయాలపాలయ్యారు. బస్సులో తిరుపతికి వెళ్తున్న 30 మంది తీవ్రగాయాల పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన నేషనల్ హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ముష్టి విష్ణును, క్షత గాత్రులను హైవే, 108 అంబులెన్సుల ద్వారా వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న పెబ్బేరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గురైన వెహికిల్స్ను పక్కకు తొలగించి దాదాపు 3, 4 గంటల పాటు శ్రమించి ట్రాఫిక్కును సరి చేశారు.



## హైకోర్టు చీఫ్ జస్టిస్ కు స్వాగతం పలికిన కలెక్టర్ నారాయణరెడ్డి

వారధి న్యూస్, రంగారెడ్డి జిల్లా:

ఎల్బీనగర్ లో గల రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ సంజయ్ పాల్ రాఖీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా చీఫ్ జస్టిస్ కు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.





# రంగారెడ్డి జిల్లాలో టీయూడబ్ల్యూజే ఐజేయూ సభ్యత్వ నమోదు ప్రారంభం.

- **త్వరలో జిల్లా మహాసభలు.**
- **యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**

వారధి న్యూస్ , రంగారెడ్డి జిల్లా :

రంగారెడ్డి జిల్లాలో టీయూడబ్ల్యూజే ఐజేయూ బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశం తొర్రుర్ లోని శ్రీరస్థు బ్యాంకెట్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3 వ తేదీ వరకు జిల్లాలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన తర్వాత జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ మహాసభల సందర్భంగా జిల్లాలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయా నియోజకవర్గాలకు జిల్లా కమిటీ బాధ్యులు, ఆయా ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు ఇంచార్జ్ లుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. జిల్లా బాధ్యులు సమిష్టిగా కృషి చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యునియాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మాఫీసిల్ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీమ్ పాషా, సత్యానారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు కటకం సుభాష్, ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు జగన్ గౌడ్, రాజేష్,కోశాధికారి సంరెడ్డి శశిపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాండు, వెగ్గలం శ్యామ్, బద్దుల మల్లేష్ యాదవ్, దర్శనం జంగయ్య, రచ్చ శేఖర్, ఆవంచ సురేందర్, పాల్గొన్నారు.



## వనదుర్గా మాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- **దుర్గమ్మను దర్శించుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే. పద్మదేవేందర్ రెడ్డి**

వారధి ప్రతినిధి మెదక్

మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఎం పద్మ దేవేందర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఏడుపాయల జాతర పురస్కరించుకొని వనదుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ వనదుర్గామాత ఆశీస్సులతో మెదక్ జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయా అర్చకులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జాతరలో ప్రతి ఏటా మాదిరిగా గాజులు కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ లు బాల గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, పాపన్నపేట పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రెడ్డి,మాజీ ధర్మకర్తలు మనోహర్ దుర్గయ్య కిష్టయ్య, తాజా మాజీ సర్పంచ్ లు జగన్,గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, శ్రీనాథ్ రావు,బద్రి మల్లేశం,నవీన్ గౌడ్ నాయకులు వెంకటేశం, సాయిరెడ్డి, బాబా గౌడ్, సాయిరెడ్డి,కిష్టయ్య,కిష్టా గౌడ్, శంకర్ సెట్, శ్రీనివాస్,మల్లేష్, సాయిలు, పాల్గొన్నారు.








# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఐజేయు లక్ష్యం

- **టీయూడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ నమోదులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామ్ నారాయణ**
- **జర్నలిస్టులు విలువలతో కూడిన జర్నలిజం అందించాలని విజ్ఞప్తి**
- **ఓకే రోజు 100 మందికి పైగా జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు**

వారధి న్యూస్, ఖమ్మం:

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టీయూడబ్ల్యూజే (ఐజేయు) లక్ష్యమని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టే కోల రామ్ నారాయణ పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్ట్ యూనియన్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సామినేని మురారి ఖమ్మం నగర కమిటీ అధ్యక్షులు మైస పాపారావు, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర కమిటీ అధ్యక్షుడు మైస పాపారావు అధ్యక్షతన జరిగిన సభలో రామ్ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆరు దశాబ్దాలకు పైబడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఐజేయు అనుబంధంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులతో పాటు ఇండ్ల స్థలాలు సాధించిన ఘనత యూనియన్ కు ఉందని ప్రస్తావించారు. రెండు దశాబ్దాలుగా ఖమ్మం నగరంలో, జిల్లాలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారం కావడం లేదని, సమస్య పరిష్కారం కోసం యూనియన్ చిత్తశుద్ధితో పని చేస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టులు విలువలతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. యూనియన్ కు జర్నలిస్టుల సంఖ్య ముఖ్యం కాదని, నాణ్యమైన , విలువలు కలిగిన జర్నలిస్టులు యూనియన్ కు అవసరం అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో, రాష్ట్రంలో పెద్ద ఎత్తున యూనియన్ కు సభ్యత్వం ఉందని పేర్కొన్నారు. పోరాటాలు, ఉద్యమాల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని, ఆ రీతిలో జిల్లా, నగర కమిటీలు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఖమ్మం నగర కమిటీ బాధ్యులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో సభ్యత్వ నమోదు విజయవంతంగా పూర్తిచేయాలని రామ్ నారాయణ స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, సామినేని మురారి, జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మొయినిద్దీన్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, ఎన్టీవీ బ్యూరో భూపాల్, శ్రీనివాస్, నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మైస పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, జిల్లా వీడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఆలస్యం అప్పారావు, జిల్లా ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు కమటం శ్రీనివాస్ తదితరులు యూనియన్ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగించారు.

**ఒకేరోజు వందమందికి పైగా జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు :**

టి యు డబ్ల్యూ జే (ఐజేయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, బ్యూరోలు , స్టాఫ్ రిపోర్టర్లు, ఫోటో వీడియో జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు, డెస్క్ ఇన్చార్జులు, ఇతర మీడియా విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని యూనియన్ సభ్యత్వాన్ని అందుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే . రామ్ నారాయణ చేతుల మీదుగా అందరికీ సభ్యత్వాలు అందజేశారు. వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో ఒకే రోజు వంద మందికి పైగా జర్నలిస్టులు సభ్యత్వాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ కోశాధికారి పురుషోత్తం, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నాయకులు తాళ్లూరి మురళీ కృష్ణ, కళ్యాణ్ చక్రవర్తి, పసుపు లేటి సత్య నారాయణ, రమేష్, జనార్ధనా చారి, వేణు గోపాలరావు, శ్రీనివాస్, బసవేశ్వర రావు, పోటు శ్రీనివాస్, శ్రీనివాసరావు, డెస్క్ జర్నలిస్టులు ప్రసాదరావు, నారాయణరావు, సందీప్ కుమార్, అచ్చిరెడ్డి, నవీన్, చంద్ర శేఖర్, రాంబాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితర జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు రాజు అయ్యేది ఎప్పుడు ???



' రైతే రాజు ' అన్న మాట వినడానికి బాగుంటుంది. కానీ వాస్తవాలు చూస్తే రైతు పండించిన పంటపై ఆధారపడిన దళారులు, మధ్యవర్తులు, వ్యాపారస్తులే అధికంగా సంపాదించి రాజులుగా మారుతున్నారు. పడిపోయిన టమాటా రేటే దీనికి నిదర్శనం ! దారుణంగా కిలో నాలుగు రూపాయలకు పడిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో ఈ పంటను సాగుచేసిన రైతన్నకు లాభం ఏంటి ? కనీస పెట్టుబడి కూడా రాని స్థితి ! ఇది ఒక ఉదాహరణ మాత్రమే. దీనికి కారణాలను అన్వేషిస్తే, కర్ణుడు చావుకు కోటి కారణాలు అన్నట్లు వ్యవసాయం లాభసాటి కాకపోడానికి కారణాలనేకం. రైతే దేశానికి వెన్నెముక అనేది కేవలం కాగితాలకే పరిమితమైంది. వాస్తవానికి ఎక్కువ కష్టబడి తక్కువ లాభాలు ఆర్జిస్తున్న రంగం ఏదయినా ఉందంటే అది వ్యవసాయ రంగం మాత్రమే !

రైతు శ్రేయస్సే జాతి శ్రేయస్సు. కారణం మనకు ఎంత సంపద ఉన్నా సరే మన ఆకలిని తీర్చే వాడు. రైతు మాత్రమే !

ఉపాధిలో అగ్రస్థానం:

ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వ్యవసాయయోగ్యమైన భూమిని కలిగి ఉన్న మన దేశ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తూ ప్రజల ఆహారవసరాలు తీర్చే వ్యవసాయం గ్రామీణ ప్రజానీకానికి వెన్నెముక. దేశ మొత్తం భూభాగంలో వ్యవసాయ అవసరాల కోసం దాదాపు 60 శాతం భూభాగం వినియోగించ బడుతున్నది. ఉపాధి, ఉత్పత్తి పరంగా ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైనది. యాభై యెనిమిది శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయమే ఆధారం. గ్రామాలలోనే నివసిస్తున్న 72.8% మంది జనాభాలో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ యాభై శాతానికి పైగా ప్రజలకు జీవనోపాధిని అందిస్తుంది. మొత్తం శ్రామిక శక్తిలో యాభై యెనిమిది శాతం ఈ రంగంలోనే ఉన్నారు. దేశ జిడిపిలో వ్యవసాయ వాటా సుమారు పద్దెనిమిది శాతం. ఆహార పరిశ్రమల ముడి పదార్థాలు వ్యవసాయం నుండే లభిస్తున్నాయి. అధిక జనాభాతో అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రజల ఆహార భద్రతను నిర్ధారించడంలోను, పరిశ్రమలు, సేవారంగాల వృద్ధికి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుంది. గ్రీన్హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి, జీవవైవిధ్యాన్ని రక్షించడానికి వ్యవసాయం సహాయపడుతుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వ్యవసాయ రంగానికి రైతన్నే కీలకం.

**సవాళ్ళు:**

రైతులు వ్యవసాయంలో ఉత్పాదకత, లాభదాయక జీవననాణ్యతకు ఆటంకం కలిగించే అనేక సవాళ్లను ఎదుర్కుంటున్నారు. వ్యవసాయం పర్యావరణ, ఆర్థిక, సంస్థాగత, సాంకేతికతపరంగా ఎన్నో ఆటుపోట్లకు గురవుతున్నది. విత్తు నుండి కోత వరకూ రోజూ రైతుకు ఒత్తిడే ! తరతరాలుగా కుటుంబ సభ్యుల మధ్య జరిగిన భూవిభజన, అధిక జనాభా కారణంగా చిన్న రైతులు అప్పులు తీర్చుకోవడానికి తమ భూమిలో కొంత భాగాన్ని అమ్ముకోవడం వలన సాగుభూమి చిన్నాభిన్నంగా చిన్న కమతాలుగా మారుతున్నాయి. దీని మూలాన నీటిపారుదలకు, యాంత్రీకరణకు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలింబించడానికి ఆటంకం కలుగుతుంది. అంతేగాక చిన్న కమతాలు పంటల ఉత్పాదకతను తగ్గిస్తాయి. భూమి పరిమాణం చాలా తక్కువగా ఉన్నప్పుడు సాగు ఆర్థికంగా ఉండదు. నాణ్యమైన విత్తనాల కొరత పెద్ద సమస్యగా మారింది. కొంత మంది వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. తక్కువ ధరకి వస్తున్నాయనో లేదా అరువుగా ఇస్తున్నారనో, అవగాహనా లోపంతోనో చాలా మంది రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఎరువులు, పురుగుమందులు విషయంలో కూడా ఇంతే ! నాణ్యమైన ఎరువులు లేక నేల నిస్సారమై పంట ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి దిగుబడి తగ్గి పంట ఉత్పత్తి కాక వ్యవసాయ ఉత్పాదకత తగ్గుతుంది. రైతులు ఉసూరుమంటున్నారు. నాణ్యమైన పంటలకు సరైన సమయంలో సరైన అవకాశాలు మొత్తంలో నీరు ఉండాలి. దేశంలో ఎక్కువ శాతం వ్యవసాయం వర్షాధారంపైనే ఆధారపడివుంది. దేశంలోని 14.1కోట్ల హెక్టార్ల స్థూల విత్తన విస్తీర్ణంలో 52 శాతం అంటే దాదాపు 7.3 కోట్ల హెక్టార్లు నీటిపారుదల సౌకర్యాన్ని కలిగి ఉందని నీతి ఆయోగ్ డేటా తెలుపుతుంది. అరవై ఐదు శాతం వ్యవసాయం ఋతుపవన వర్షపాతంపై ఆధారపడి ఉంది. మొత్తం నీటిపారుదల ప్రాంతంలో 40 శాతం కాలువల మీద, మిగిలినది భూగర్భ జలాల మీద ఆధారపడి ఉంది. ఋతుపవనాలలో ఏమాత్రం తేడా వచ్చి సరైన సమయంలో వర్షం పడకపోతే కాలువల మీద ఆధారపడిన ప్రాంతాలలో కూడా పంటలు పండవు. ఇక కాలువేతర ప్రాంతాలలో కేవలం భూగర్భజలాలే ఆధారం. సాగునీరుగా భూగర్భజలాలను అధికంగా వాడడం వల్ల తాజా భూగర్భజల స్థాయిలు క్షీణించాయి. అతివృష్టి, అనావృష్టి, పంట ఉత్పత్తిపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా అస్థిరత్వానికి గురవుతోంది. భూ వనరులపై అధిక జనాభా ఒత్తిడి కారణంగా వర్షాధార ప్రాంతాలు, ముఖ్యంగా పొడి భూములు తక్కువ దిగుబడిని ఎదుర్కొంటున్నాయి. వరి, గోధుమలు, పత్తి, నూనె గింజలతో సహా భారతీయ పంటల దిగుబడులు అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. హరిత విప్లవం, అస్తవ్యస్త నీటిపారుదల వ్యవసాయ పద్ధతులు భూమి క్షీణతకు దారితీశాయి. మానవ కార్యకలాపాల వల్ల వర్షాధార ప్రాంతాలు కూడా నేల కోతను క్షీణతను ఎదుర్కొంటుంది. ఒకే పంటను పదే పదే సాగుచేయడం వల్ల నేల పోషకాలును కోల్పోయి నిస్సారంగా మారింది. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరతో పాటుగా లేబర్ ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. పంట పెట్టుబడికి రైతులు అధిక వడ్డీకి రుణాలు వాడుతున్నారు. పంట నష్టపోవడం, పంటలకు గిట్టుబాటుధర లేకపోవడం, అధిక ఖర్చులు వలన సగానికి పైగా వ్యవసాయ కుటుంబాలు అప్పుల పాలవుతున్నారు. చాలా మంది అనధికారిక వనరుల నుండి రుణాలు పొందుతున్నారు. వాణిజ్యపంటలు సాగుచేసే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. కరువు, పంట నష్టాలు వలన అప్పుల ఊబిలో కూరుకుపోయి ఒక్కోసారి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అసమర్థమైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలు ధరల అస్థిరతకు దారితీస్తాయి. సరైన నిల్వ, రవాణా సౌకర్యాలు లేకపోవడం వలన రైతులు వెంటనే తక్కువ ధరకే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇది పంట అనంతర నష్టాలను మరింత పెంచుతుంది. వీరు పండించే పంటలను విక్రయించడానికి ఇప్పటికీ దళారులపైనే ఆధారపడుతున్నారు. దళారులు రైతులను మోసం చేస్తున్నారు. నేరుగా మార్కెటింగ్ విధానం లేకపోవడం వలన వచ్చే ఆదాయంలో కొంత భాగం మధ్యవర్తుల పాలవుతున్నది. ప్రస్తుతం ఉన్న పంటల విధానం కొన్ని ప్రధాన పంటల వైపు మాత్రమే మొగ్గుచూపే విధంగా ఉన్నాయి. పంటలలో వైవిధ్యం లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం తెగుళ్ళు, వ్యాధులు, మార్కెట్ ఒడిదుడుకుల బారినపడుతుంది. సాగులో ఆధునిక సాంకేతికలు అమలు పరచడం లేదు. అందరూ స్వంత వ్యవసాయ కమతాలు కలిగి ఉండరు. ఇంకో పెద్ద రైతు దగ్గర వ్యవసాయ క్షేత్రాన్ని కౌలుకు తీసుకుంటారు. పంట సరిగా పండకపోతే వీరు మరింత పేదరికంలోనికి నెట్టబడుతున్నారు.

**పరిష్కారాలు:**

సవాళ్లను పరిష్కరించడానికి బహుముఖ విధానం అవసరం.

వ్యవసాయంలో సాంకేతికతను జోడించి ఖర్చులను కనిష్ఠం చేసే మార్గాలను ప్రవేశపెట్టాలి. వ్యవసాయ పనితీరును మెరుగు పరచడం, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధికి భరోసా ఇవ్వడానికి ఈ సవాళ్లను పరిష్కరించడం అత్యవసరం. ఇటు రైతు అటు ప్రభుత్వాలు వ్యవసాయానికి రెండు చక్రాల్లాంటి వారు. రైతులు. నేల క్షీణతను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలి. పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలి. డ్రిప్, స్ప్రింక్లర్ సిస్టంలతో సహా, సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులు అవలంబించాలి. విభిన్న పంటరకాలు, పద్ధతులను అనుసరించాలి. సేంద్రీయ ఎరువులు వాడాలి. ఇక ప్రభుత్వ పరంగా సమర్థవంతమైన నీటిపారుదల పద్ధతులు, వర్షపునీటి సంరక్షణను అమలు చేయాలి. తీవ్రమైన వాతావరణ వైపరీత్యాలను ఎదుర్కునేందుకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి. ఆహారోత్పత్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు నిర్ణయించే ఆహార ధాన్యాల ధరలకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా వారు సహేతుకమైన ఆదాయాన్ని పొందేలా చూడాలి. పారదర్శక సరసమైన ధరల విధానాలను ఏర్పాటు చేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నేరుగా విక్రయించే ఏర్పాట్లు చేయాలి. రైతులకు ఆర్థిక సహాయం మరింత చేయాలి. రైతులు అధునాతన వ్యవసాయ సాంకేతికతలు అంది పుచ్చుకోడానికి డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించాలి. భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, సుస్థిరతను ప్రోత్సహించడానికి, ఉత్పాదకతను పెంచడానికి, దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. జై కిసాన్ !



జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# అంగరంగ వైభోగంగా రథోత్సవం...



- ఏడుపాయల క్షేత్రం భక్తి సాగరమయింది
- విద్యుత్ దీపాల కాంతులతో అమ్మ దుర్గమ్మ ఆలయం

వారధి ప్రతినిధి మెదక్

మహా జాతరలో చివరి ఘట్టమైన రథోత్సవం శుక్రవారం రాత్రి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఏడుపాయల జాతరను ఎంతో ఆనందంగా గడిపారు అంగరంగ వైభోగంగా జోరుగా ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ కాంతులతో వెలిగిపోయింది. అమ్మవారికి ఇవన్నీ భక్తుల ఇలవేల్పుగా నెలవైన ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం సొంతం. ఈ చోటుకు వస్తే చాలు మదినిండా ఎన్నో అనుభూతులు నింపుకోవచ్చు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆనంద పారవశ్యంలో మునిగి తేలవచ్చు. ఊళ్లకు ఊళ్లే కదలివచ్చే ఏడుపాయల మహా జాతరలో ఎటు చూసినా భక్తుల సందడి.. ప్రతి ఒక్కరి నోట వన దుర్గమ్మ తల్లి.. చల్లంగా చూడమ్మా.. అంటూ జయ జయ ధ్వానాలు మారుమోగుతుంటాయి. పోటాపోటీగా కేంద్రాల వద్ద మద్దతుదారులు.. ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు భక్తులకు ఆధ్యాత్మికతను, పర్యాటకులకు మధుర జ్ఞాపకాలను పంచుతామంటూ వన దుర్గమ్మ కొలువైన అడవి స్వాగతం పలుకుతుంది. లక్షలాది మంది భక్తుల ఇలవేల్పైన వనదుర్గమ్మ కొలువైన ఏడుపాయల అడవుల్లో ఎన్నో రకాల అనుభూతులు చెందుతున్నారు. ఎద ఎద భక్తి భావంతో.. మదినిండా పరవశంతో.. ఏడుపాయల క్షేత్రం భక్తి సాగరమైంది. వనదుర్గమ్మ దర్శనానికి భక్తులు బారులు తీరారు. మరి కొందరు దర్శించుకోవడానికి కదిలోస్తున్నారు. తనివితీరా అమ్మను దర్శించుకుని పులకించి పోతున్నారు. సంతానం కోసం సంతానం గుండంలో స్నానాలు చేయగా మరికొందరు భక్తులు తలనీలాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.వన దుర్గమ్మ సన్నిధిలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతున్న మహా జాతరలో ప్రధాన ఘట్టం జోడెడ్ల బండ్ల ఊరేగింపు. ఇట్టి ఘట్టాన్ని గురువారం జోరుగా నిర్వహించారు. ముందుగా పాపన్నపేట సంస్థానాధీశుల జోడేడ్ల బండిని గురువారం ఉదయం పాపన్నపేట గ్రామస్తులు ఘనంగా ఊరేగింపు నిర్వహించి జాతర మహోత్సవానికి సాగనంపారు. సాయంత్రానికి ఏడుపాయలకు చేరుకున్న సంస్థానాధీశుల బండికి ఈవో చంద్రశేఖర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జోడెడ్ల బండ్ల ఊరేగింపును అట్టహాసంగా ప్రారంభించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ఎడ్ల బండ్లు అందరినీ ఆకట్టుకున్నాయి. రంగురంగుల చీరలు, కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు, దేవతామూర్తుల చిత్రపటాలతో బండ్లను అందంగా తీర్చిదిద్దారు.బండ్ల ముందు ఆయా గ్రామాల యువకులు డప్పు చప్పుల మధ్య సందడి చేస్తూ నృత్యాలు చేశారు. శివసత్తులు శిగాలూగుతుండగా.. పోతురాజులు గావు కేకలు.. జోడెడ్ల గంటల గలగలలు.. భక్తుల జయ జయ ద్వానాలతో ఏడుపాయల రాతి కొండలు మారుమోగాయి. ఏడుపాయల ముఖద్వారం నుంచి అమ్మవారి ఆలయం రాజగోపురం ముందు నుంచి బండ్ల ఊరేగింపు కొనసాగింది. జాతరలో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్స్, చిన్నారుల ఆట బొమ్మలు, టూరింగ్ టాకీసులు, పచ్చబొట్టు, టాటూస్ భక్తులకు ఆటవిడుపును కలిగించాయి. బండ్ల ప్రదర్శనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు. ఆలయ ఈవో, సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు. ఆయా శాఖల అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా వారి పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. పారిశుద్ధ్య మెరుగుకు సిబ్బంది అనునిత్యం శ్రమిస్తున్నారు.





**రథోత్సవం తో ముగియనున్న సంబరం..**

మహా జాతరలో చివరి ఘట్టమైన రథోత్సవం శుక్రవారం రాత్రి నిర్వహించారు. రంగురంగుల కలర్లు, పుష్పాలతో రథాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాల కాంతులతో అందంగా అలంకరించి అందులో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు చేస్తారు. అనంతరం రథం గోలి వద్ద నుండి తాళ్లతో భక్తులు లాగుతూ.. వన దుర్గామాత ఆలయం ముందు వరకు రథయాత్రను కొనసాగిస్తారు. దీంతో ఏడుపాయల మహా జాతర ఉత్సవాలు ముగుస్తాయి.









## విశ్వంభర రిలీజ్ తేదీ వాళ్ల చేతుల్లోనే ఉందా?

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తోన్న 'విశ్వంభర' రిలీజ్ కోసం ప్రేక్షకాభిమానులు ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. సంక్రాంతికి రిలీజ్ అవ్వాల్సిన సినిమా అనివార్య కారణలతో వాయిదా పడింది. అప్పటి నుంచి రిలీజ్ తేదీపై సరైన స్పష్టత రాలేదు. మార్చి లేదా? ఏప్రిల్ , మేలో రిలీజ్ అవుతుందనే కొత్త ప్రచారం షురూ అయింది. అయితే మేకర్స్ ఈ ప్రచారంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే వాయిదా పడిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో సమ్మర్ కి షురూ అవుతుందని అంతా నమ్ము తున్నారు. అయితే ఈ సినిమా రిలీజ్ ఇంకా వాయిదాల పర్వం కొనసాగేలా కనిపిస్తోంది. ఈ సినిమాకి సంబంధించి రిలీజ్ తేదీపై స్పష్టత రావాలంటే డిజిటల్ బిజినెస్ క్లోజ్ అయితే గానీ రాదని తాజా సమాచారం. ప్రస్తుతం దానికి సంబంధించిన చర్చలు జీ స్టూడియోస్ తో జరుగుతున్నాయట. ఆ డీల్ ఎప్పుడు పూర్తవుతుందన్నది ఇంకా క్లారిటీ రాలేదు. అది ఇంకా చర్చల దశలో ఉంది. డీల్ క్లోజ్ అయితే జీ స్టూడియోస్ సూచించిన స్ట్రీమింగ్ స్లాట్ ప్రకారం మేకర్స్ రిలీజ్ తేదీ ప్రకటించాలని చూస్తున్నారట. దీనిపై మార్చిలో ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటున్నారు. అంటే మార్చిలో రిలీజ్ తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో జులైలో సినిమా రిలీజ్ అయ్యే అవకాశాలున్నాయంటున్నారు. కొంత పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తి కావాల్సి ఉందట. 'విశ్వంభర' సోషియో ఫాంటసీ చిత్రం కావడంతో సీజీ వర్క్ అధికంగానే ఉంది. సీజీ కోసం నెలల తరబడి పనిచేస్తున్నారు. అవసరం మేర విదేశాల్లో కూడా కొంత సీజీ వర్క్ జరుగుతుంది. అందుకు తగ్గట్టు ప్లాన్ చేసుకుని మేకర్స్ ముందుకెళ్తున్నారు. థియేట్రికల్ గా సినిమాకి పెద్ద ఎత్తున బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది.



## కన్నప్ప.. ఇదే సరైన టైమ్..

టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప.. రిలీజ్ కు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. మహాశివుడు పరమ భక్తుడు కన్నప్ప జీవిత ఆధారంగా సినిమాను ముఖేష్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై డైలాగ్ కింగ్ మోహన్ బాబు.. భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. మూవీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రీతి ముకుందన్ హీరోయిన్ గా నటిస్తుండగా.. పాన్ ఇండియా లెవెల్ లో అనేక మంది నటీనటులు ప్రాజెక్ట్ లో భాగమయ్యారు. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, కాజల్ అగర్వాల్, మధుబాల, శివరాజ్ కుమార్, శరత్ కుమార్, బ్రహ్మానందం, బ్రహ్మాజీ తదితరులు.. గెస్ట్ రోల్స్ లో సినిమాలో సందడి చేయనున్నారు. అయితే పాన్ ఇండియా లెవెల్ లో ఏప్రిల్ 25వ తేదీన సినిమాను రిలీజ్ చేస్తామని ఇప్పటికే మేకర్స్ అనౌన్స్ చేశారు. ఆ నేపథ్యంలోనే కొద్ది రోజుల క్రితం ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. రీసెంట్ గా వేగం పెంచారు. శివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తి ఆలయానికి వెళ్లి అక్కడ టీజర్ ప్లే చేశారు. మార్చి 1వ తేదీన టీజర్ ను రిలీజ్ చేస్తామని తెలిపారు. ఆ తర్వాత నిన్న ముంబైలో ఈవెంట్ నిర్వహించారు. టీజర్ ను లాంచ్ చేశారు. ఇప్పుడు మరిన్ని కార్యక్రమాలు ప్లాన్ చేస్తున్నారు. అయితే రిలీజ్ కు ఇంకా 45 రోజుల సమయం ఉంది. దీంతో మేకర్స్.. ఆడియన్స్ లో బజ్ భారీగా క్రియేట్ అయ్యేలా చేయాలి. వరుస ఈవెంట్లు, ఇంటర్వ్యూలు సహా అన్నీ గ్రాండ్ గా నిర్వహించాలి. మూవీలో స్టార్ క్యాస్టింగ్ అంతా గెస్ట్ రోల్స్ చేస్తుండడంతో.. వేరే లెవెల్ లో అంచనాలు క్రియేట్ చేయాల్సిందే. కానీ ఇప్పుడు అనుకున్నంత ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ అవ్వలేదు. దీంతో మంచు విష్ణు దానిపై ఫోకస్ చేయాలని, ఇదే సరైన టైమ్ అని అంటున్నారు నెటిజన్లు. ఇప్పటికే కన్నప్ప స్టోరీ అందరికీ తెలుసని, కాబట్టి థియేటర్లకు అందరినీ రప్పించేలా చేయాలని చెబుతున్నారు. ఓల్డ్ వెర్షన్ లో చాలా మార్పులు చేశామని చెబుతున్న విష్ణు.. దాన్ని ప్రజల్లో తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. నార్త్ లో బజ్ క్రియేట్ చేస్తే తిరుగుండదని అంటున్నారు. రీసెంట్ గా మహాకుంభమేళా జరగడంతో.. ఆ ఆధ్యాత్మిక సెంటిమెంట్ ను ఉపయోగించుకోవాలని చెబుతున్నారు. అన్నింటికీ సరైన టైమ్ ఇదేనని.. ఆడియన్స్ కు భారీగా రీచ్ అయితే ఇంకా తిరుగులేదని అంటున్నారు. మరి మేకర్స్ ఏం చేస్తారో చూడాలి.

## సెగలు పుట్టిస్తున్న శివంగి

బుల్లితెర ముద్దుగుమ్మలు అంటే ఒకప్పుడు చిన్న చూపు ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. సినిమాల్లో హీరోయిన్స్‌కి ఏ స్థాయి గుర్తింపు అయితే ఉంటుందో ఆ స్థాయిలో లేదా అంతకు మించి గుర్తింపును బుల్లి తెర ముద్దుగుమ్మలు దక్కించుకుంటున్నారు. భాష ఏదైనా బుల్లి తెరకు ఇప్పుడు మంచి గుర్తింపు లభిస్తుంది. సీరియల్స్‌కి ఈమధ్య కాలంలో మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో సీరియల్‌లో అయినా నటించేందుకు సిద్దం అన్నట్లుగా హీరోయిన్స్ రెడీ అవుతున్నారు. వెండి తెర హీరోయిన్స్‌కి తగ్గకుండా బుల్లి తెర హీరోయిన్స్ ఇన్‌స్టాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటారు. టీవీ సీరియల్స్ ద్వారా గుర్తింపు దక్కించుకున్న హీరోయిన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుని హీరోయిన్స్‌గా ఆఫర్లు దక్కించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫోటోలు షేర్ చేస్తే ఇండస్ట్రీలో ఎంట్రీ దక్కుతుంది అనుకునే వారు చాలా మంది ఉన్నారు. అందుకే ఎంతో మంది అందాల ఆరబోత ఫోటోలతో మత్తెక్కిస్తూనే ఉంటారు. తాజాగా బుల్లితెర నటి శివంగి వర్మ తన అందమైన ఇన్‌స్టా ఫోటోలతో ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడు షేర్ చేసిన మిర్రర్ సెల్ఫీ ఫోటోలతో ఆకట్టుకుంది. హిందీలో ఎన్నో సీరియల్స్‌లో శివంగి వర్మ నటించి మెప్పించింది. హమారీ సిస్టర్ దీదీ, బివి ఔర్ మైన్, భూతు ఇతర ప్రాజెక్ట్‌ల్లోనూ ఈమె కనిపించింది. బుల్లి తెర ద్వారా వచ్చిన గుర్తింపుతో ఇప్పటికే సినిమాల్లోనూ ఎంట్రీ ఇచ్చింది. బిచ్చగాడు 2 సినిమాలో ఈమె చేసిన ప్రత్యేక పాటకు మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా ఈ అమ్మడు తన అందంతో ఎప్పుడూ సోషల్ మీడియా ద్వారా ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజా ఫోటో షూట్‌తో అసలు చూపు తిప్పుకోనివ్వడం లేదు. నడుము అందం చూపిస్తూ క్లీ వేజ్ షో చేసిన ఈ అమ్మడి ఫోటోలకు తెగ లైక్స్ వస్తున్నాయి. మత్తు కళ్లతో మిర్రర్ ముందు నిల్చుని తన అందమైన నడుమును క్లిక్ అనిపించిన ఈ అమ్మడు నాభి అందంతో మతి పోగొడుతోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందాల ఆరబోత చేసిన ముద్దుగుమ్మ శివంగికి బాలీవుడ్‌లో మరిన్ని మంచి ఆఫర్లు దక్కాల్సిన అవసరం ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ అమ్మడి ఫోటోల జోరు, అందం, ఫిజిక్ చూస్తూ ఉంటే కచ్చితంగా భవిష్యత్తులో మంచి ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుల్లి తెర నుంచి పర్మినెంట్‌గా వెండి తెరపై ఈ అమ్మడు సందడి చేస్తుందేమో చూడాలి.





## డీ గ్లామర్ బ్యూటీగా బుట్టబొమ్మ!

ఇప్పటి వరకూ పూజా హెగ్డే వెండి తెరపై అందమైన బ్యూటీగానే హైలైట్ అయింది. ప్రియురాలు, ప్రేమికురాలి పాత్రల్లో తెరపై ఎంతో అందంగా కనిపించింది. తొలి సినిమా `ఒక లైలా కోసం నుంచి `ఆచార్య` వరకూ డీసెంట్ బ్యూటీగా హైలైట్ అయింది. దీంతో డీ గ్లామర్ పాత్రలకు దూరమవ్వాల్సి వచ్చింది. కథను బట్టి రకరకాల పాత్రలు పోషించింది గానీ డీగ్లామర్ పాత్రల్లో నటించే ఛాన్స్ రాలేదు. అయితే తొలిసారి డీగ్లామర్ పాత్రకు సై అనేసింది.రాఘవ లారెన్స్ స్వీయా దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న `కాంచన 4`లో పూజాహెగ్డే ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఆమె పాత్ర ఎలాంటిది అన్నది ఇంత వరకూ క్లారిటీ రాలేదు. ఈ నేపథ్యంలో పూజా హెగ్డే డీగ్లామర్ పాత్రలో కనిపించనుందని సమాచారం. అమ్మడు సినిమాలో ఎక్కడా మ్యాకప్ లేకుండానే కనిపిస్తుందట. బాగా వెనుకబడిన పల్లెటూరి అమ్మాయి పాత్రలో మాస్ కోణంలో పూజా హెగ్డే రోల్ ఉంటుందట. `గంగ` చిత్రంలో నిత్యామీనన్ కంటే మరింత డీగ్లామర్ గా పూజాహెగ్డే పాత్ర ఉంటుందని అంటున్నారు. ఇందులో ఆమె బధిర యువతి పాత్ర పోషిస్తుందట. కథని మలుపు తిప్పే పాత్ర ఇదేనని సమాచారం. బలమైన పాత్రలో పూజా హెగ్డే ఆహార్యం సహా నటన సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. డీగ్లామర్ పాత్రల్లో పూజా హెగ్డే ఇంతవరకూ ఏ సినిమాలో నటించలేదు. అలాంటి ఆహార్యానికి కూడా ఎక్కడా ఛాన్స్ తీసుకోలేదు.ఆన్ ది స్క్రీన్ ఆఫ్ ది స్క్రీన్ లో ఎప్పుడూ మోడ్రన్ గానే కనిపించింది. అలాంటి నటి తొలిసారి డీగ్లామర్ పాత్ర పోషించడం అంటే ఓరకంగా ఇది అమ్మడికిది పెద్ద సవాల్ అనే చెప్పాలి. ప్రస్తుతం ఈ సినిమా సెట్స్ లో ఉంది. ఇందులో నోరా పటేహీ కూడా కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆమె పాత్ర కూడా బలంగా ఉంటుందని సమాచారం.